# మల్లూరు టు మౌంట్ ఎవరెస్ట్ !



ఆఫ్రికా కిలిమంజారో పర్వతంపై జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తున్న వివేక్

- సాఫ్ట్‌వేర్ జాబ్ చేస్తూనే ట్రెక్కింగ్‌లో రాణిస్తున్న గిరిజన యువకుడు
- గతేడాది కిలిమంజారో, ఎల్‌బ్రూస్ పర్వతాలను అధిరోహించిన వివేక్
- 2024లో ఎవరెస్ట్, నేపాల్-చైనా సరిహద్దున అన్ని పర్వతాలు లక్ష్యమంటున్న వాడగూడెం వాసి
- ప్రభుత్వం సాయం చేయాలని వేడుకోలు



ఎల్‌బ్రూస్ పర్వతంపై తెలంగాణ మ్యాప్‌ను ప్రదర్శిస్తున్న వివేక్

అతడు చేస్తున్నది సాఫ్ట్‌వేర్ ఉద్యోగం అయినా మౌంట్ ట్రెక్కింగ్ అంటే చాలా ఇష్టం. చిన్నప్పుడు సరదాగా స్నేహితులతో కలిసి మల్లూరు గుట్టలపైకి వెళ్లి చుట్టూ కలియదిరిగేవాడు. అలా పర్వతారోహణ చేయాలనే ఆలోచన అతని మదిలో బాల్యంలోనే ఏర్పడింది. అదే ఆసక్తి పెద్దయ్యాక అకుంఠిత దీక్షతో ఆఫ్రికాలోని కిలిమంజారో, రష్యాలోని ఎల్‌బ్రూస్‌లను అధిరోహించేలా చేసింది. ఇప్పుడు మౌంట్ ఎవరెస్ట్ ఎక్కాలన్నదే తన లక్ష్యమని ఇందుకు ప్రభుత్వం ఆర్థికంగా సాయం చేయాలని కోరుతున్నాడు మంగపేట మండలం వాడగూడం గిరిపుత్రుడు వాసం వివేక్.

– మంగపేట, డిసెంబర్ 17

ములుగు జిల్లా మంగపేట మండలం వాడగూడేనికి చెందిన వాసం సమ్మయ్య-జమున దంపతులకు ముగ్గురు కుమారులు కాగా, వివేక్ రెండవ వాడు. వివేక్ పస్రా, వరంగల్‌లో ప్రాంతంలో ప్రాథమిక, ఉన్నత విద్యను పూర్తిచేశాడు. హైదరాబాద్‌లో ఇంటర్, బెంగళూరులో బీటెక్ చదివాడు. 2011లో తండ్రి సమ్మయ్య మృతిచెందగా, తల్లి కష్టపడి తగిన ప్రోత్సాహాన్ని ఇచ్చి వివేక్ చదువుకు ఎలాంటి ఆటంకం లేకుండా చూసింది. ప్రస్తుతం వివేక్ హైదరాబాద్‌లో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా స్థిరపడ్డాడు. అయితే చిన్ననాటి నుంచి పర్వతారోహణ చేయాలనే మదిలోని కోరికను తీర్చుకోవాలని 2019 నుంచి ఆ దిశగా దృష్టిసారించాడు. ఇందుకోసం మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సూచనలు, సలహాలు తీసుకొని ప్రయత్నం మొదలు పెట్టినట్లు వివేక్ తెలిపారు. 2022 అక్టోబర్ 15న ఆఫ్రికాలోని కిలిమంజారో పర్వతారోహణ, ఈ ఏడాది ఆగస్టు 15న రష్యాలోని ఎల్‌బ్రూస్ పర్వతాలు అధిరోహించాడు. రెండు పర్వతాలు కూడా సముద్ర మట్టం నుంచి 20వేల అడుగుల ఎత్తు ఉన్నట్లు తెలిపారు. పర్వతాల అగ్రభాగానికి చేరుకొని గడ్డ కట్టే ఆ మంచుకొండలపై జాతీయ పతాకాలను ఆవిష్కరించి, తెలంగాణ రాష్ట్ర పటాన్ని ప్రదర్శించడం గొప్ప అనుభూతినిచ్చినట్లు వివేక్ తెలిపారు.


పర్వతారోహణ చేసిన ఆయా ప్రాంతాల వారితో వివేక్

## ఎవరెస్ట్ పర్వతారోహణే లక్ష్యం

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ఎవరెస్ట్ పర్వతాన్ని అధిరోహించడమే తన లక్ష్యమని వివేక్ తెలిపారు. పరిస్థితి అనుకూలించి, ప్రభుత్వం నుంచి తగిన ప్రోత్సాహం లభిస్తే 2024లో తప్పక సాధిస్తానని ఆశాభావం వ్యక్తంచేశారు. నేపాల్-చైనా సరిహద్దులో ఉన్న ప్రధాన పర్వతాలతో పాటు ఏడు ఖండాల్లోని ప్రధాన పర్వతాలన్నింటి పైనా పాదం మోపాలన్న ధ్యేయంతో ముందుకెళ్తున్నట్లు తెలిపారు. అయితే ఇందు కోసం తనకు ఆర్థికపరమైన సహాయం అవసరమని పర్వతారోహణ సంస్థ ద్వారా ప్రోత్సాహం అందించాలని కోరారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూనే పర్వతారోహణ చేస్తున్న వివేక్‌కు తెలంగాణ గవర్నర్ తమిళిసై ఈ ఏడాది జనవరి 6న రాజ్‌భవన్‌లో ప్రశంసా పత్రం అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో పర్వతారోహణలో తాను అనుకున్న లక్ష్యాలను చేరుకొని దేశానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావాలకున్నట్లు వివేక్ తెలిపారు.

# పాలీహౌస్.. లాభాలు భేష్



తొర్రూరు, డిసెంబర్ 17 : మహబూబాబాద్ జిల్లా తొర్రూరుకు చెందిన దళిత రైతు మంగళపెల్లి నీలిమ ఫత్తేపురం శివారులో ప్రభుత్వ ఆర్థిక సాయంతో ఉద్యాన శాఖ సహకారంతో 2019లో ఎకరంలో పాలిహౌస్ ఏర్పాటుచేశారు. అందులో మొదట క్యాప్సికం, కీరదోస సాగుచేశారు. వాటికి పెట్టుబడి ఎక్కువ, దిగుబడి సరిగా రాకపోవడం, పైగా దిగుబడిని డిమాండ్‌కు తగ్గట్టుగా అమ్ముకోవాలంటే హైదరాబాద్ మార్కెట్ కు వెళ్లాల్సి రావడంతో నష్టాలను చవిచూశారు. పండించిన ఉత్పత్తులను సుదూర ప్రాంతాలకు వెళ్లి అమ్ముకోవడం, నిత్యం వ్యయప్రయాసాలకు ఓర్చుకోవడం నుంచి లాభసాటిగా ఉన్న చోటనే డబ్బులు సంపాదించాలనే విభిన్నమైన కోణంలో ఆలోచించి సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేశారు. ఫలితంగా మూడేళ్ల నుంచి పాలీహౌస్‌లో వినూత్న ప్రయోగాలు చేస్తూ లాభాల బాట పట్టారు. ఫలితంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణలో ఉన్న విత్తనాభివృద్ధి సంస్థ నుంచి 2021లో ఆర్గానిక్ సర్టిఫికేషన్ కూడా పొందారు. రాష్ట్రస్థాయిలో ఉత్తమ మహిళా రైతుగా గుర్తించి ఏడాది క్రితం అప్పటి సుప్రీంకోర్టు జడ్జి హిమాకోహ్లి చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. తొర్రూరులో సేంద్రియ ఆకు కూరల విక్రయ కేంద్రాన్ని నిర్వహిస్తూ తాను లాభాలు గడిస్తూ పది మంది కూలీలకు జీవనోపాధి కల్పిస్తున్నారు.

- సేంద్రియ పద్ధతిలో ఆకుకూరలు సాగు
- కొత్త ఒరవడితో ఆదర్శంగా నిలుస్తున్న నీలిమ
- ఇక్కడ పండించే కూరగాయలకు భలే గిరాకీ
- అధికారుల సహకారం, భర్త ప్రోత్సాహంతో ముందుకు..
- తొర్రూరు విక్రయకేంద్రంలో జోరుగా విక్రయాలు
- రాష్ట్రస్థాయి ఉత్తమ రైతుగా గుర్తింపు


ఫత్తేపురంలోని పాలీహౌస్‌లో కూరగాయల సాగు పనుల్లో నిమగ్నమైన రైతు నీలిమ

## సాగు విధానం ఇలా..

భూసారం పెంచడానికి నీలిమ తనవంతుగా కొత్త పంథాను ఎంచుకున్నారు. భూసారం కోసం జీవామృతం, ఘన జీవామృతం, వర్మీ కంపోస్ట్, పశువుల ఎరువు వాడుతున్నారు. ఆవు మూత్రం, పేడ, కషాయం, ఐతాకుల కషాయం, మట్టి ద్రావణం మొదలైనవి వాడుతూ సాగును చేస్తున్నారు. అలాగే భూమిలో సారం పూర్తిగా దహించుకుపోకుండా సంవత్సరానికి ఆరు నుంచి 8 నెలలు ఆకుకూరలు పండిస్తూ, బయట ఆకుకూరలు (సేంద్రియం కాని పంట) వచ్చే సమయంలో సుమారు నాలుగు నెలలు భూమిని ఖాళీగా ఉంచుతూ కొత్త టెక్నిక్‌ను ఫాలో అవుతున్నారు. ఎకరం నేలలో 125 ట్రాక్టర్ ట్రిప్పుల ఎరువు (ఆవు పేడతో సహజ సిద్ధంగా తయారు చేసిన) వేసి భూసారాన్ని పెంచి విత్తనం వేసి మొలక వచ్చిన 15రోజుల లోపు వేప కషాయం, ఆవుమూత్రంతో తయారు చేసిన జీవామృతం స్ప్రే చేస్తూ తెగుళ్లు రాకుండా జాగ్రత్తలు తీసుకుని అధిక దిగుబడులు సాధిస్తున్నారు. స్వతహాగా తయారు చేసుకున్న రెయిన్ పైప్ ద్వారా నీటిని తగిన రీతిలో అందిస్తూ నిత్యం ఆరుగురు శ్రమించి ఎలాంటి కలుపు రాకుండా, పురుగుమందులు వాడకుండా కూరగాయల సాగుచేస్తున్నారు.

## ఆకుకూరలతోనే ఆరోగ్యం అని..

ఆకుకూరలైతే ఆరోగ్యానికి మంచిదని, మరీ ముఖ్యంగా గర్భిణులు, మహిళలు, బాలికలతో పాటు ఎక్కువ మంది వాటిని తినడానికి ఇష్టపడతారని ఆ దిశగా సాగుకు సన్నద్ధమయ్యారు. సేంద్రియంలో ఆకుకూరల సాగుతోనే లాభాలు గడించొచ్చని గ్రహించి పాలీహౌస్‌లోనే పాలకూర, మెంతి, గంగవాయిలి, తోటకూర, బచ్చలి, చుక్కకూర వంటి ఆకుకూరలు పండించడం మొదలుపెట్టారు. తాను పండించిన ఆకుకూరలు సుమారు నాలుగు రోజులైనా పాడవకుండా నిల్వ ఉంచుకోవచ్చని, సహజ సిద్ధంగా సాగు జరగడంతో ఆకుకూరల రుచి కూడా బాగుంటుందనే అభిప్రాయాన్ని అందిరికీ కలిగించారు. దీంతో సాగుక్షేత్రానికే డాక్టర్లు, వ్యాపారులు, టీచర్లు, ఎక్కువ సంఖ్యలో ప్రజలు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. సహజసిద్ధంగా కూరలను పండిస్తూ పలువురి మన్ననలు పొందడమే కాకుండా సేంద్రియంలో చిట్కాలు పంచుతూ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.



తొర్రూరులో సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన ఆకు కూరలను విక్రయిస్తున్న రైతు నీలిమ

## వేలిముద్ర నుంచి డిగ్రీ పట్టా వైపు..

నీలిమ మొదట ఏమీ చదువలేదు. కానీ పెళ్లి అయిన తర్వాత భర్త కృష్ణమూర్తి సహకారంతో పట్టుదలతో చదువుకుని పదో తరగతి పాస్ అయి ఇంటర్ పూర్తి చేశారు. ఆ తర్వాత అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో అడ్మిషన్ తీసుకుని ప్రస్తుతం డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్నారు. అలాగే, కేసీఆర్ సర్కారు మహిళా పారిశ్రామికవేత్తలను తయారు చేయడానికి వీ హబ్ ద్వారా ఇస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని కూడా నీలిమ గత సంవత్సరం పూర్తి చేశారు.

## అందుకున్న అవార్డులు..

నీలిమ జిల్లా ఉద్యానశాఖ వారితో ఉత్తమ రైతు అవార్డు తీసుకున్నారు. గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ విద్యాన్ ప్రతిష్ట, కేవీకే రైతు మిత్ర ఫౌండేషన్ వారి నుంచి పుడమి పుత్ర రాష్ట్ర స్థాయి ఉత్తమ రైతు అవార్డు స్వీకరించారు. ఎస్వీఎస్ సహాయక వేదిక వారి నుంచి భూమిరత్న రాష్ట్రస్థాయి అవార్డును కూడా పొందారు. అవీ కాకుండా ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్ సంస్థ వారు ఇటీవల హైదరాబాద్‌లో మెడికవర్ హాస్పిటల్ వారితో కలిసి వివిధ రంగాల్లో విశిష్ట ప్రతిభను కనబరుస్తున్న 11మంది మహిళలను గుర్తించి సత్కరించారు. వ్యవసాయరంగంలో తెలంగాణలోనే ఉత్తమ మహిళా రైతుగా ఏడాది క్రితం అప్పటి సుప్రీం కోర్టు జడ్జి హిమా కోహ్లీ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

## ఆదాయం ఇలా..

ప్రతిరోజు క్వింటాల్ చొప్పున నెలలో 20 రోజులు ఆకుకూరలను కట్ చేసి అమ్ముతారు. క్వింటాల్‌కు రూ.4వేల నుంచి రూ.5వేల వరకు ఆదాయం వస్తున్నది. తన పాలీహౌస్‌లో రోజుకు ఆరుగురి కూలీలు పని చేస్తారు. దున్నడానికి, విత్తనానికి, కూలీల ఖర్చులన్నీ పోగా నెలకు సుమారు రూ.40వేల నుంచి రూ.50వేల వరకు లాభవం వస్తోందని ఆనందంగా చెబుతున్నారు నీలిమ.

## వ్యాపార వేత్తగా ఎదగడమే లక్ష్యం..

డిగ్రీ పూర్తి చేసిన తర్వాత మరిన్ని ఉన్నతమైన చదువులు చదివి వ్యాపారవేత్తగా ఎదగాలనేది తన చిరకాల కోరిక అని నీలిమ చెబుతున్నారు. చిన్నప్పుడు అస్సలే చదువు లేని కారణంగా మొదట్లో చదువు కోవడం అంటే కాస్త ఇబ్బందిగానే అనిపించిందని, భర్త ప్రోత్సాహంతో రాణించగలుగుతున్నానన్నారు. ఎందరో గొప్పగొప్ప వ్యక్తులు తమ ఫెయిల్యూర్ నుంచే సక్సెస్ మంత్రాన్ని పొందారని వాళ్లే తనకు ఆదర్శమని ఈ సందర్భంగా నీలిమ తన ఆకాంక్షను పంచుకున్నారు.



# ముష్టి గింజలతో మస్తు ఉపాధి


ముష్టి కాయలు

గిరిజన సహకార సంస్థ ద్వారా అటవీ ఉత్పత్తుల సేకరణ గిరిజన ప్రాంతాల్లో కొనసాగుతోంది. ఇందులో ప్రమాదకరమైన ముష్టిగింజలను వివిధ రకాల ఫార్మాస్యూటికల్ కంపెనీలు ఔషధాల తయారీలో వినియోగిస్తుండగా వీటికి డిమాండ్ ఎక్కువగా ఉంది. ఆయా ప్రాంతాలకు బట్టి అటవీ ఉత్పత్తులు విరివిగా లభిస్తుంటాయి. గతేడాది ఏటూరునాగారం జీసీసీ డివిజన్ పరిధిలో 150 క్వింటాళ్ల వరకు ముష్టి గింజలను సేకరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సేకరించిన ఈ గింజలను టెండరు ద్వారా విక్రయిస్తుంటారు. గత ఏడాది ఒడిశాకు చెందిన ఫార్మాస్యూటికల్ కంపెనీ కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. అటవీ ప్రాంతాల్లో విరివిగా లభించే వీటి సేకరణకు జీసీసీ ఏర్పాటు చేసిన సేల్స్ డిపోల ద్వారా కొనుగోలు చేసి ఆయా బ్రాంచిల పరిధిలో ఉన్న గోదాంలకు పంపిస్తారు. అక్కడ నుంచి డివిజన్, రాష్ట్ర స్థాయి గోదాంలకు వెళ్లిన తర్వాత వచ్చిన మొత్తాన్ని బట్టి ఉన్నతాధికారులు టెండర్లు నిర్వహిస్తారు.అయితే ఈసారి జీసీసీ దీనిపై ప్రత్యేక దృష్టిసారించింది. నెల రోజుల క్రితం జీసీసీ జనరల్ మేనేజర్ ఏటూరునాగారంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ముష్టి గింజల సేకరణ ఎక్కువగా చేపట్టేందుకు అధికారులు, ఉద్యోగులు క్షేత్రస్థాయిలో పర్యటించి సేకరణదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. దీంతో ఆయా బ్రాంచి మేనేజర్లు, సేల్స్‌మెన్‌లు అటవీ ప్రాంత గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి సేకరణపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ ఏడాది ఏటూరునాగారం జీసీసీ డివిజన్ పరిధిలో కనీసం 300 క్వింటాళ్ల ముష్టిగింజల సేకరణ చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. డివిజన్ పరిధిలో సుమారు 2392 మంది గిరిజనులు ఏటా అటవీ ఉత్పత్తుల సేకరణలో పాల్గొంటారు. ప్రస్తుతం కేజీకి రూ. 45 చొప్పున సేకరణ జరుగుతోంది. అయితే వీటి ధర కూడా పెరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

- అటవీ ఉత్పత్తులతో అడవి బిడ్డలకు ఉపాధి
- ఈ నెల నుంచే మొదలైన సేకరణ
- కొనుగోలు చేసేందుకు జీసీసీ కసరత్తు
- బ్రాంచి మేనేజర్లకు రూ. 63లక్షల అడ్వాన్సులు
- గ్రామస్థాయిలో కొనుగోలుకు సేల్స్‌మెన్‌లు


ముష్టిగింజలు సేకరించిన వృద్ధురాలు

అటవీ ఉత్పత్తులతో అడవి బిడ్డలకు ఉపాధి కలుగుతున్నది. ముష్టి గింజల సేకరణ వారికి కల్పత రువుగా మారింది. వీటిని వివిధ ఔషధాల తయారీలో వినియోగిస్తుండడంతో డిమాండ్ పెరిగింది. అటవీ ప్రాంతాల్లో విరివిగా లభించే ముష్టి గింజలను ఈ నెల, వచ్చే నెలలోనే ఎక్కువగా సేకరిస్తారు. వాటిని ఏరి, ఎండబెట్టి గిరిజన సహకార సంస్థకు విక్రయిస్తారు. ఇందుకోసం జీసీసీ డివిజన్ పరిధిలోని బ్రాంచి మేనేజర్లకు రూ.63 లక్షలు అడ్వాన్స్‌గా కేటాయించింది. గ్రామస్థాయిలో కొనుగోళ్లకు సేల్స్‌మెన్లను నియమించింది. ప్రస్తుతం కేజీకి రూ. 45 చొప్పున ఇస్తుండగా, ధర కూడా పెరిగే అవకాశం ఉన్నదని అధికారులు చెబుతున్నారు.

– ఏటూరునాగారం, డిసెంబర్ 17



ముష్టి చెట్టు

## ఈ నెల నుంచే మొదలైన సేకరణ

అటవీ ప్రాంతాల్లో విరివిగా లభించే ముష్టిగింజల సేకరణ ఈ నెల, వచ్చే నెలలోనే ఎక్కువగా జరుగు తుంది. చెట్ల నుంచి కింద రాలిన ముష్టి కాయలను ముందుగా సేకరిస్తారు. వాటిని పగులగొట్టి గింజలను తీసి ఎండబెడుతారు. తర్వాత వాటిని విక్రయిస్తారు. కొందరైతే చెట్ల పైకి ఎక్కి పండుగా మారిన కాయలను రాల్చుకుంటారు. వాటిని ఏరుకోవడం, గింజలను ఎండబెట్టడం చేస్తుంటారు. వీటిని మార్కెట్‌లో ఇతరులు ఎవరూ కొనే అవకాశం లేనందున జీసీసీ మాత్రమే కొనుగోలు చేస్తుంది. ఆదాయం కల్పించే ముష్టిగింజల చెట్లను నరకడం చేయరు. చెట్లు ఏపుగా ఉండడంతో ఎక్కువ కాయలు లభించే అవకాశాలు ఉన్నాయి. అడవిలో ఉండే ఈ చెట్ల వద్దకు తరచూ వారు వెళ్తున్నందున నేరుగా వాటి వద్దకే వెళ్లి సేకరిస్తారు. ఇవి విషపూరితమైన గింజలు కావడం వల్ల వీటి పట్ల సేకరణదారులు జాగ్రత్తలు తీసుకుంటారు. ఇండ్లల్లో నిల్వ చేసుకోవడం, చిన్న పిల్లలకు దూరంగా ఉంచడం చేస్తుంటారు.

## రూ. 63లక్షలు అడ్వాన్సుగా ఇచ్చాం

ముష్టి గింజల కొనుగోలు కోసం డివిజన్ పరిధిలోని బ్రాంచి మేనేజర్లకు రూ. 63 లక్షలు అడ్వాన్సుగా ఇచ్చాం. గతేడాది 150 క్వింటాళ్ల వరకు సేకరించాం. ఈసారి మరింత పెంచడానికి ముందస్తుగా ప్రణాళిక చేశాం. సమావేశాలు ఏర్పాటు చేయడం, సేకరణదారులకు అవగాహన కల్పించడం లాంటివి చేస్తున్నాం. ఏటూరునాగారం బ్రాంచికి రూ. 15లక్షలు, వెంకటాపురానికి రూ. 8లక్షలు, ములుగుకు రూ. 10లక్షలు, నర్సంపేటకు రూ. 10లక్షలు, మహదేవపూర్‌కు రూ. 10లక్షలు, మన్ననూరు బ్రాంచికి రూ. 10లక్షల చొప్పున అడ్వాన్సు ఇచ్చాం. ఈనెల నుంచి సేకరణ ప్రారంభమవుతుంది. కొనుగోలు చేసిన విత్తనాలను సంస్థ టెండరు నిర్వహిస్తుంది. ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు చెందిన ఔషధాల కంపెనీలు టెండర్ల ద్వారా వీటిని పొందుతాయి. బ్రాంచి పరిధిలోని సేల్స్‌డిపోల ద్వారా వీటిని సేకరిస్తున్నాం.



– ప్రతాప్‌రెడ్డి, జీసీసీ డివిజనల్ మేనేజర్


సేకరించిన ముష్టి గింజలను పరిశీలిస్తున్న అధికారులు